# యువత క్రీడల్లో రాణించాలి


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల

- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల
- క్రికెట్ విజేత జట్లకు బహుమతుల ప్రదానం

కోరుట్ల రూరల్, మార్చి 16: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల పిలుపునిచ్చారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దారిశెట్టి రాజేశ్ ఆధ్వర్యంలో మాదాపూర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల మాట్లాడుతూ, క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని పేర్కొన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత క్రీడా పోటీలు ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. అనంతరం గెలుపొందిన జట్టుకు ట్రోఫీతో పాటు రూ.10 వేలు, రన్నరప్ జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యేను పోటీల నిర్వాహకులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం అధ్యక్షుడు ఆదిరెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు మారుతీ, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి కొప్పుల పరామర్శ


పెగడపల్లి: బతికపల్లిలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఈశ్వర్

వెల్గటూర్, మార్చి 16: ఎండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నిమ్మ రాము అనారోగ్యంతో బాధపడుతూ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ వెళ్లి పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు.

పెగడపల్లి, మార్చి 16: పెగడపల్లి మండలం బతికపల్లి గ్రామానికి చెందిన సయ్యద్ సర్వర్, సయ్యద్ జాకీర్, తాటిపాముల తిరుపతి ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబసభ్యులను ఆదివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వోరుగంటి రమణారావు, పార్టీ మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, నాయకులు రాజేశ్వర్‌రావు, నర్సింహారెడ్డి, నరేందర్‌రెడ్డి, షేక్ హైదర్ షకీల్, మడిగెల తిరుపతి, అందె వెంకటేశం, మనోహర్, శ్రీరాం కరుణాకర్, లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

## ఎమ్మెల్సీని కలిసిన మాజీ మంత్రి


ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు తిరుపతి వేంకటేశ్వర స్వామి శాలువాను అందజేస్తున్న మాజీ మంత్రి రాజేశం గౌడ్

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని నివాసంలో ఆదివారం మాజీ మంత్రి రాజేశంగౌడ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంతెన మధు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు సంబంధించి రిజర్వేషన్ల గురించి చర్చించారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ, శాసన మండలిలో బీసీలకు విద్యలో 46 శాతం, ఉద్యోగ నియామకాల్లో 46 శాతం, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని, వీటి కోసం పోరాడుతానని పేర్కొన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి సంబంధించి పలు విషయాలను రాజేశం గౌడ్‌తో చర్చించారు.

-జగిత్యాల రూరల్, మార్చి 16

# వైభవంగా కోనేటి రాయుడి తెప్పోత్సవం


కోనేరులో హంస వాహనంపై స్వామి వారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ధర్మపురి, మార్చి 16: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం బ్రహ్మపుష్కరిణి (కోనేరు)లో వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం, డోలోత్సవం నిర్వహించారు. మొదట ఆలయం నుంచి వేంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తులను సేవపై ఉంచి మేళతాళాల మధ్య ఊరేగింపుగా కోనేరు వద్దకు తీసుకువచ్చారు. అలంకరించిన హంస వాహనంపై ఆసీనులను చేసి కోనేరు చుట్టూ భక్తుల గోవింద నామ స్మరణ మధ్య ఐదు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం కోనేరు మధ్యలో గల మండపంలోని ఊయలలో స్వామి వారలను ఉంచి పండితుల మంత్రోచ్ఛరణల మధ్య డోలోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్‌కుమార్, ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు ఎదులాపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచన్న, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, మందుల మల్లేశ్, నేదునూరి శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంభంకాడి గణేశ్‌కుమార్, వొజ్జల సౌజన్య, అవ్వ గంగాధర్, దేవస్థానం ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసాచార్య, వేద పండితుడు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## నిందితుల రిమాండ్

జగిత్యాల రూరల్, మార్చి 16: ఆస్తి కోసం తండ్రిని చంపిన కుటుంబ సభ్యులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు. పొలాస గ్రామానికి చెందిన పడాల కమలాకర్ జమున, లలిత అనే ఇద్దరూ అక్కాచెల్లెళ్లను పెళ్లి చేసుకున్నాడు. మొదటి భార్య జమునకు ఇద్దరు కొడుకులు, కూతురు ఉన్నారు. రెండో భార్యకు పిల్లలు లేరు. కమలాకర్ ఇటీవల కర్నాటక రాష్ట్రం బీదర్ నుంచి మరో మహిళను మూడో పెళ్లి చేసుకొని తీసుకువచ్చాడు. మూడో భార్యకు పిల్లలు పుడితే ఆస్తి పోతుందని మొదటి భార్య, ఆమె పిల్లలు కమలాకర్‌తో గొడవ పడుతున్నారు. ఈ క్రమంలో జమునతో పాటు కుమారులు పడాల రంజిత్, పడాల చిరంజీవి, కూతురు శిరీష, అల్లుడు శోభన్ బాబు శనివారం కమలాకర్ ఇంటికి వెళ్లి అతనితో గొడవపడ్డారు. మొదట కత్తితో దాడి చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించడంతో చికిత్స పొందుతూ కమలాకర్ మృతి చెందాడు. నిందితులు జమున, రంజిత్, చిరంజీవి, శిరీష, శోభన్ బాబును ఆదివారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

పెగడపల్లి, మార్చి 16: పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో 88 మంది లబ్ధిదారులకు సుమారు రూ. 28.88 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆదివారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గంలో ప్రభుత్వ కోటాతో సంబంధం లేకుండా అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని చెప్పారు. వచ్చే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ శ్రీనివాస్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాములుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ఆధునిక సమాజంలో మహిళల పాత్ర కీలకం


మహిళ ఉద్యోగిని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత

జగిత్యాల, మార్చి 16: ఆధునిక సమాజంలో అన్ని రంగాల్లో మహిళల పాత్ర కీలకమని, వారి హక్కులను కాపాడుతూ ఆర్థికంగా బలోపేతం చేయడానికి అనేక పథకాలను ప్రభుత్వం రూపొందించిందని విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత ఆధ్వర్యంలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు అడ్లూరితో పాటు డాక్టర్ సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సంక్షేమాధికారి నరేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. అదనపు కలెక్టర్ బీఎస్ లత మాట్లాడుతూ, మహిళలు ఆర్థికాభివృద్ధి సాధిస్తూ, కుటుంబ, సమాజపరంగా గౌరవం పొందుతూ పిల్లలను భావితరాలకు ఆదర్శవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, సాధికారిత, వీసీపీఎస్, చైల్డ్ హెల్ప్‌లైన్ సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హరి అశోక్‌కుమార్

## వయోవృద్ధుల చట్టంపై అవగాహన

కోరుట్ల, మార్చి 16: పట్టణ శివారులోని శివసాయి గార్డెన్‌లో ఆదివారం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో వయోవృద్ధుల రక్షణ, పోషణ సంక్షేమ చట్టంపై వయోధికులు, వారి కొడుకులు, కోడళ్లకు, వివిధ సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ, వయోధికులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంఘం ప్రధాన సలహాదారు గుంటుక సాంబమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ చిలుక గంగారాం, అసోసియేట్ అధ్యక్షుడు రాజేశ్వర్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు హన్మంత్ రెడ్డి, నాయకులు రాజ్ మోహన్, సాబిత్ అలీ, లక్ష్మీనారాయణ, రాజయ్య, చిన్న మల్కయ్య, తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

మేడిపల్లి, మార్చి 16: భీమారం మండలం పసునూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మాలోతు రమేశ్‌నాయక్ కుమారుడు ఇటీవల మృతి చెందాడు. కాగా, బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహరావు ఆదివారం బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌లో మాట్లాడి, తన ప్రగాఢ సంతాపం తెలిపారు. అలాగే, బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు క్యాతం సత్తిరెడ్డి, నాయకులు చెన్నమనేని అజీత్‌రావు, నెల్లుట్ల ప్రభాకర్, గండ్ర దిలీప్‌రావు, గండ్ర సురేందర్‌రావు, లోలపు రాజిరెడ్డి, గాజోజి చారి, ఈరవేణి గంగాధర్ పరామర్శించారు.


బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఎడ్యుకేషన్ హబ్‌గా జగిత్యాల

రాయికల్, మార్చి 16: జగిత్యాల ఎడ్యుకేషన్ హబ్‌గా మారిందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. రాయికల్ మండలం ఉప్పమడుగు గ్రామంలోని కస్తూర్బాలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆదివారం ఆయన భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ రాజిరెడ్డి, జిల్లా విద్యాధికారి రాము, ఈఈ అనితా సింగ్, తహసీల్దార్ ఖయ్యూమ్, ప్రిన్సిపాల్ శోభారాణి, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం


అయ్యప్ప ఉత్సవమూర్తికి అభిషేకార్చన చేస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు దంపతులు

మారుతీనగర్, మార్చి 16: మెట్‌పల్లి పట్టణంలోని అయ్యప్ప ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతుల ఆధ్వర్యంలో అయ్యప్ప ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు–సరోజన దంపతులు లోక కల్యాణార్థం హోమం, అయ్యప్ప స్వామికి 108 కలశాలతో అభిషేకార్చన, తదితర పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే పట్టణాభివృద్ధి

జగిత్యాల, మార్చి 16: ప్రజల సహకారంతోనే పట్టణాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. మోతె గ్రామ పంచాయతీ పరిధిలోని గోవింద్‌పల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. అంతకు ముందు శివాంజనేయ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు లే–అవుట్ ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని కోరారు. గోవింద్‌పల్లి వాగుపై వంతెన నిర్మాణానికి రూ.4.5 కోట్లు మంజూరుకు ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే, నియోజకవర్గానికి చెందిన 102 మంది లబ్ధిదారులకు రూ. 28 లక్షల 25 వేల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మోతే రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి, గిరి నాగభూషణం, గోలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు స్వప్న–రాజేశ్వర్ రెడ్డి, నాయకుడు కొలగాని ప్రేమలత–సత్యం, ఎంపీడీవో వాసవి, తదితరులు పాల్గొన్నారు.


లోగోను ఆవిష్కరిస్తున్న గ్రాడ్యుయేట్ అసోసియేషన్ సభ్యులు

## లోగో ఆవిష్కరణ

మేడిపల్లి, మార్చి 16: భీమారం మండలం వెంకట్రావుపేట గ్రామంలో ఆదివారం గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ లోగో, రిజిస్ట్రేషన్ కాపీ, సభ్యత్వ నమోదు, లేటర్ ప్యాడ్‌లను అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు కాటిపెల్లి శ్రీపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ రాజేశ్, ఉపాధ్యక్షుడు ఎండీ గులామ్, జనరల్ సెక్రటరీ వెంకటేశ్, ట్రెజరర్ ఎం వినోద్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రాజేశ్, సలహాదారులు జలంధర్‌రెడ్డి, గంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరానికి విశేష స్పందన

జగిత్యాల రూరల్, మార్చి 16: మండలంలోని మోరపెల్లి గ్రామంలో శ్రీ పావని మల్టీ స్పెషాలిటి దవాఖాన (జగిత్యాల) ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ, పేదలకు నాణ్యమైన వైద్య సేవలందించేందుకే వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సుమారు 200 మందికి వివిధ పరీక్షలు చేసి, మందులు అందజేశారు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డిని జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం చైర్మన్ మహిపాల్ రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లింగారెడ్డి, రాజిరెడ్డి, రాము, శేఖర్, కొక్కుల గణేశ్, భూమారెడ్డి శాలువాతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో దవాఖాన సిబ్బంది ఒల్లాల జలందర్, అంజలి, శ్రవణ్, నరేశ్ పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ జిల్లా ఉప గవర్నర్‌కు అభినందన


కోరుట్ల, మార్చి 16: పట్టణానికి చెందిన గుంటుక చంద్రప్రకాశ్ ఆదివారం లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ జిల్లా రెండో ఉప గవర్నర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, చంద్ర ప్రకాశ్‌కు క్లబ్ ప్రతినిధులు అభినందన సభ ఏర్పాటు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కుందారపు మహేందర్, కార్యదర్శి శ్రీగద్దె నరేంద్ర, కోశాధికారి కొమ్ముల జగపతి రెడ్డి, పోతని ప్రవీణ్‌కుమార్, ఆడెపు కమల, కొమ్ముల జీవన్ రెడ్డి, డాక్టర్ గండ్ర దిలీప్ రావు, ఆడెపు మధు, అల్లాడి ప్రవీణ్, చాప కిశోర్, అలిమిల్ల ఉషాకిరణ్, గుంటుక సురేశ్ బాబు, మంచాల జగన్, గండ్ర అజయేందర్ రావు, గుంటుక మహేశ్, దుబాయ్ శ్రీను, పొలాస రవీందర్, గాజెంగి నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

## వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా

జగిత్యాల, మార్చి 16: సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని జగిత్యాల ఎస్ఈ సాలియా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33 కేవీ, 11 కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియ చేపట్టామని, ఇప్పటి వరకు 33 కేవీ పోల్ నంబరింగ్ 41 ఫీడర్స్ పూర్తయ్యాయని, 11 కేవీ పోల్ నంబరింగ్ 61 ఫీడర్స్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే ఆ పోల్ నంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకొని అక్కడికి వెళ్లి సమస్యను పరిష్కరించవచ్చని వెల్లడించారు. దీని ద్వారా విద్యుత్ అంతరాయం సమయాన్ని తగ్గించవచ్చని తెలిపారు.

## ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

మల్యాల(కొడిమ్యాల), మార్చి 16: మల్యాల ఎక్స్‌రోడ్డులోని ఎస్ఎస్వీ అల్ఫోర్స్ ఈ–టెక్నో పాఠశాల వార్షికోత్సవం ఆదివారం జగిత్యాలలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత ఊట్కూరి నరేందర్‌రెడ్డి హాజరై పాఠశాల నివేదికను చదివి వినిపించారు. వివిధ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

## ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు..
## దళిత సంక్షేమ పథకాలకే వినియోగించాలి

పెగడపల్లి, మార్చి 16: ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను దళిత సంక్షేమ పథకాలకే వినియోగించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెగడపల్లిలో ఆదివారం డీహెచ్‌పీఎస్ జిల్లా స్థాయి సర్వసభ్య సమావేశం నిర్వహించగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో అంబేద్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షలు అందజేస్తామని హామీ ఇచ్చారని, వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులకు రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, అర్హులైన దళితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. ఈ సమావేశంలో సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, జిల్లా అధ్యక్షుడు మణుగూరు హనుమంతు, నాయకులు ప్రవీణ్, రామిల్ల రాంబాబు, మంథని రాజు, శ్రీనివాస్, నర్సయ్య, స్వామి, ప్రకాశ్, రాజేశ్, లచ్చయ్య, నర్సయ్య పాల్గొన్నారు.

## ఉత్తమ ఉద్యోగులకు పురస్కారం

జగిత్యాల, మార్చి 16: జిల్లా కేంద్రంలోని మోతె వాడ పీహెచ్‌సీ ఏఎన్ఎం శిరీష అదనపు కలెక్టర్ బీఎస్ లత చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్నారు. శిరీషను మోతె అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు స్వాతి లక్ష్మణ్, తోటి సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు అభినందించారు.

పెగడపల్లి, మార్చి 16: పెగడపల్లి ఐకేపీ ఏపీఎం సమత జిల్లా స్థాయిలో ఉత్తమ మహిళా ఉద్యోగి అవార్డు అందుకున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం జగిత్యాలలోని కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ బీఎస్ లత, జిల్లా సంక్షేమాధికారి డాక్టర్ నరేశ్, డీఆర్డీవో రఘువరన్ చేతుల మీదుగా ఏపీఎం సమతకు అవార్డు ప్రదానం చేశారు. ఏపీఎంకు అవార్డు రావడం పట్ల సీసీలు స్వామి, శశికుమార్, తిరుపతి, రవికుమార్, అకౌంటెంట్ రాము, వీవోఏలు, మహిళా సంఘాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## కార్యవర్గం


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

జగిత్యాల, మార్చి 16: జిల్లా కేంద్రంలోని ఎస్‌కేఎన్ఆర్ కాలేజ్ వాకర్స్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం నిర్వహించినట్లు ప్రచార కార్యదర్శి కొడిపెల్లి పురుషోత్తం రెడ్డి తెలిపారు. అధ్యక్షుడిగా గుండా సురేశ్, ఉపాధ్యక్షుడిగా పిల్లి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా సాగి శ్రీధర్ రావు, కోశాధికారిగా ఎంబారి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా సిగిరి రాజేందర్, మామిడిపెల్లి రాజు, ప్రచార కార్యదర్శులుగా కొడిపెల్లి పురుషోత్తం రెడ్డి, కూసుంబ శ్రీనివాస్, సాంస్కృతిక కార్యదర్శిగా వేముల శ్రావణ్‌తో పాటు 10 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా చల్ల లక్ష్మీరెడ్డి, మేళ్ల రవీందర్ వ్యవహరించారు.


## ఏప్రిల్ చివరి వరకు సాగు నీరందించాలి

జగిత్యాల(సారంగాపూర్), మార్చి 16: ఏప్రిల్ చివరి వారం వరకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని రైతులు ఆదివారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని కోరారు. బీర్‌పూర్ మండలం తుంగూర్, బీర్‌పూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, రోళ్లవాగు ప్రాజెక్టు కింద మొన్నటి వరకు వచ్చిన నీటి తడి చివరి భూముల వరకు సాగు నీరు అందిందని పేర్కొన్నారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నీళ్లు మరో రెండు తడులు వస్తాయని, ఏప్రిల్ చివరి వరకు నీళ్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ స్పందించి విషయం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ పొల్సాని నవీన్ రావు, మసర్తి రమేశ్, బల్మూరి లక్ష్మణ్ రావు, ముక్క శంకర్, గుడిసె జితేందర్, నాయకులు, తదితరులున్నారు.

## బీసీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలి

కథలాపూర్, మార్చి 16: రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 19న అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెడుతున్నందున బీసీల సంక్షేమ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్ డిమాండ్ చేశారు. కథలాపూర్ మండలం ఇప్పపెల్లిలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాభాను దృష్టిలో ఉంచుకొని నిధులు కేటాయించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో అధికంగా నిధులు కేటాయించి, చేతి వృత్తుల వారిని ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు జలేందర్, సతీశ్‌గౌడ్, వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి సర్కారు ప్రాధాన్యం


లబ్ధిదారుకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 16: ప్రజారోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యమిస్తున్నదని విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం మండలంలోని 28 మంది లబ్ధిదారులకు రూ. 10.77 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ, అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, నాయకులు పులి హరిప్రసాద్, జవ్వాజి చౌదరి, కాశవత్రి వంశీ, తిరుపతి, రాజారెడ్డి, గంగాధర్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌కు సేవా అవార్డు

మెట్‌పల్లి, మార్చి 16: ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, మెట్‌పల్లి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మైలారపు లింబాద్రికి సర్ సీవీరామన్ అకాడమీ (రుద్రాక్ష వైభవం) ఆధ్యాత్మిక పీఠం వారి సేవా వైభవ మహరాజ్(గోల్డ్ మెడల్) అవార్డు వరించింది. హైదరాబాద్‌లో ఆదివారం ఆధ్యాత్మిక పీఠం ప్రతినిధుల చేతుల మీదుగా లింబాద్రిని శాలువాతో సత్కరించి, అవార్డు ప్రదానం చేశారు. సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుండే లింబాద్రికి సేవా వైభవ మహరాజ్ అవార్డు రావడం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు, వివిధ వర్గాల ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.

## పొట్టి శ్రీరాములు విగ్రహావిష్కరణ

రాయికల్, మార్చి 16: రాయికల్‌లో మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యుల అభివృద్ధి కోసం పొట్టి శ్రీరాములు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు గంప ఆనందం, ప్రధాన కార్యదర్శి పిప్పరి గంగాధర్, కోశాధికారి చింత అశోక్, పట్టణాధ్యక్షుడు రవి, రాష్ట్ర నాయకుడు సత్యనారాయణ, నాయకులు గరిపెల్లి శ్రీనివాస్, పవన్, శివకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ పరామర్శ

జగిత్యాల(సారంగాపూర్), మార్చి 16: బీర్పూర్ మండలం తుంగూరు గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ జితేందర్‌యాదవ్ ప్రమాదవశాత్తు గాయపడగా, ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీ రమేశ్, లక్ష్మణ్‌రావు, కాంగ్రెస్ సారంగపూర్ మండలాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, కొల్వాయి సింగిల్ విండో చైర్మన్ నవీన్ రావు, మాజీ సర్పంచ్ శంకర్, నాయకులు ఉన్నారు.

## అంబేద్కర్‌కు నివాళి

జగిత్యాల రూరల్, మార్చి 16: జగిత్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ జిల్లా కో–ఆర్డినేటర్ నల్ల శ్యామ్ ఆధ్వర్యంలో సభ్యులు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫౌండేషన్ సభ్యులు నకుమల్ల లక్ష్మీనారాయణ, నాయకులు బండ శంకర్, దుమాల రాజ్‌కుమార్, మద్దెల నారాయణ, శ్రీహరి, వేణు, హనుమంతు, కడమండ్ల కమలాకర్, కారంగుల వసంత్‌కుమార్, పల్లె రవి, తదితరులు పాల్గొన్నారు.


## ఎమ్మార్పీఎస్ రిలే దీక్షలు

వెల్గటూర్, మార్చి 16: గ్రూప్–1, 2, 3లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా నియామకాలు చేపట్టడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎండపల్లి మండలం రాజారాంపల్లిలో చేపట్టిన రిలే దీక్షలు ఆదివారం రెండో రోజు కొనసాగాయి. ఈ కార్యక్రమంలో నాయకులు చెన్న కుమారస్వామి, సంతోశ్, గజ్జెల మల్లయ్య, అరికిల్ల రాములు, రాజేశ్, మహేశ్, సాయి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## పుస్తకావిష్కరణ

జగిత్యాల, మార్చి 16: జగిత్యాలకు చెందిన కవి, చిత్రకారుడు రఘువర్మ (డా.తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ) రాసిన మేఘ రాగరంజని పుస్తకాన్ని హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో గల తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యాలయంలో అకాడమీ కార్యదర్శి డాక్టర్ బాలాచారి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్కృతాంధ్ర ఆంగ్లపండితులు నారాయణ గౌడ్, కవులు బాణాల శ్రీనివాసరావు, కాంచనపల్లి గోవర్ధనరాజు, తదితరులు పాల్గొన్నారు.

## ఈత చెట్టుపై రామచిలుక


చెట్టుపై కల్లు తాగుతున్న రామచిలుక

కొడిమ్యాల మండలం కోనాపూర్ గ్రామంలో ఈత చెట్టు నుంచి వస్తున్న కల్లును ఆదివారం రామచిలుక తాగింది. చెట్టుపై అడుస్తున్న కల్లును చిలుక తాగుతుండగా 'నమస్తే' క్లిక్‌మనిపించింది.

-కొడిమ్యాల, మార్చి 16